www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 08 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృథ్విరాజు | సంపుటి - 07, సంచిక-205 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## ప్రధాని మోడీ షర్మిలకు ఫోన్చేయడంలో ఆంతర్యం



షర్మిల వెనక ఉందెవరో తేలిపోయింది

మండిపడ్డ మంత్రి సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్, డిసెంబర్ 7 (సమ సమాజం):** వార్డు మెంబర్ కాలేని వైఎస్ షర్మిలను ప్రధాని పలకరించడం విడ్డూరంగా ఉందని మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. దీనిని బట్టి షర్మిల ఎవరు వదిలిన బాణమో అని స్పష్టం అయ్యిందన్నారు. తాము ముందునుంచి చెబుతున్నట్లుగానే షర్మిల వెనక బిజెపి ఉందన్నారు. వారి ప్రోత్సాహంతోనే ఇక్కడ రాజకీయాలకు దిగారని అన్నారు. బిజెపి కుట్రలు టిఆర్ఎస్ ముందు 2లో

# అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తెలంగాణ

## ఇదంతా మన ఉమ్మడి కష్ట ఫలితమే : కెసిఆర్



- ఇలాగే పనిచేస్తే డైమండ్ఆఫ్ ఇండియా అవుతుంది
- దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పథకాలు
- నిరంతర విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే
- గురుకుల విద్యలో మనకు పోటీ,సాటి ఎవరూ లేరు
- దీనిని ఇలాగే కొనసాగించాలని జగిత్యాల సభలో పిలుపు
- కొండగట్టు అభివృద్ధికి వందకోట్లు
- యాదాద్రిలో పునర్నిర్మాణ పనులు చేస్తాం
- జగగిత్యాల సభలో సిఎం కెసిఆర్ ప్రకటన

- జగిత్యా పర్యటనలో సిఎం కెసిర్ బిజీ
- టిఆర్ఎస్ కార్యాలయానికి ప్రారంభోత్సవం
- ధరూర్లో మెడికల్ కళాశాల భవనాలకు శంకుస్థాపన
- సిఎం రాకతో గులాబీమయంగా మారిన జగిత్యాల
- దేశ భవిష్యత్ను తాకట్టు పెట్టిన మోడీ
- మేకిన్ ఇండియా పేరుతో మోసం చేసిన ప్రధాని
- చైనా వస్తువులు దిగుమతి చేసుకోవడమేనా
- దీనిపై దేశంలో ఎక్కడైనా చర్చకు సిద్ధమే
- అసత్య ప్రచారాగాళ్లను నమ్మితే నట్టేట మునుగుతాం
- మరో పదిరోజుల్లో రైతుబంధు జమ
- తెలంగాణలో మాత్రమే 24 గంటల కరెంట్
- గుజరాత్లోనూ కరెంట్ కోతలే
- బతికున్నంతవరకు రైతుబంధు,రైతుబీమా
- జగిత్యాల సభలో సిఎం కెసిఆర్ వెల్లడి



**జగిత్యాల, డిసెంబర్ 7 (సమ సమాజం):** తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. ఇలాగే కృషిచేస్తే తెలంగాణ డైమాండ్ ఆఫ్ ఇండియాగా ఎదగడం ఖాయమన్నారు. ఇప్పటికే అనేక రంగాల్లోనే దేశంలో నెంబర్1 గా నిలిచామని సీఎం కేసీఆర్ వివరించారు. ఈ అభివృద్ధిని 2లో

## జగదీప్ ధన్కర్ దేశంలోని ఎంతోమందికి స్ఫూర్తి

- రాజ్యసభను సమర్థంగా నడిపే నాయకుడు
- రాజ్యసభ ఛైర్మన్గా ధడ్కన్ బాధ్యతల స్వీకరణ
- కొత్త సభ్యులకు సభలో అవకాశం రావాలని ఆకాంక్ష
- సభలో అభినందించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 7 (సమ సమాజం):** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ దేశంలోని ఎంతోమందికి స్ఫూర్తి అని ప్రధాని మోడీ అన్నారు. రాజ్యసభ ఛైర్మన్గా తొలిసారి బాధ్యతలు చేపట్టిన ధన్కర్కు ఆయన శుభాకాంక్షలు 2లో

## ప్రజాసంగ్రామ యాత్రతో కెసిఆర్కు నిద్రపట్టడం లేదు

- హామీల అమలుకు ప్రభుత్వం వద్ద డబ్బులు ఏవీ
- ప్రజాధనం లూటీ చేసి లిక్కర్ దందా చేసిన కవిత
- పాదయాత్రలో విమర్శలు గుప్పించిన బండి సంజయ్



**నిర్మల్, డిసెంబర్ 7 (సమ సమాజం):** ప్రజా సంగ్రామ యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి సీఎం కేసీఆర్కు నిద్రపట్టడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ప్రజలకిచ్చిన హామీల అమలు చేసేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని విమర్శించారు. ప్రజాధనాన్ని లూటీ చేసి లక్ష కోట్లతో లిక్కర్ దందా చేస్తారా? అంటూ ప్రశ్నించారు. దేశమంతా కేసీఆర్ కుటుంబాన్ని చూసి 2లో

## ఫ్లై ఓవర్లు..రోడ్లు వేస్తేనే అభివృద్ధా



తెలంగానలో విద్య ఖరీదుగా మారిందన్న కోమటిరెడ్డి

**భువనగిరి, డిసెంబర్ 7 (సమ సమాజం):** టీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్య కాస్ట్లీ అయిపోయిందని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఎంతో మంది విద్యార్థులు సహాయం కోసం తన 2లో

## ఫామ్హౌజ్ కేసులో విచారణ

బండి సంజయ్ పేరు చెప్పాలంటూ శ్రీనివాస్పై సిట్ ఒత్తిడి


హైకోర్టులో శ్రీనివాస లాయర్ వెల్లడి

**హైదరాబాద్, డిసెంబర్ 7 (సమ సమాజం):** మొయినాబాద్ ఫాం హౌస్ కేసులో హైకోర్టు విచారణ కొనసాగుతోంది. కేసులో ఏ7గా ఉన్న శ్రీనివాస్ తరఫు న్యాయవాది ఉదయ్ హుల్లా ఇవాళ వాదనలు వినిపించారు. శ్రీనివాస్ను కుట్రపూరితంగా ఈ కేసులో ఇరికించారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఫాంహౌస్ వ్యవహారంతో సంబంధం లేనప్పటికీ ఆయన సిట్ విచారణకు హాజరయ్యారని చెప్పారు. సిట్ విచారణ ఎలా జరిగిందని న్యాయమూర్తి ప్రశ్నించగా.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేరు చెప్పాలని సిట్ అధికారులు ఒత్తిడి చేశారని శ్రీనివాస్ తరఫు లాయర్ ఉదయ్ హుల్లా కోర్టుకు తెలిపారు. కేవలం 2లో

## నాగోల్ దోపిడి కేసును ఛేదించిన పోలీసులు

రాజస్థాన్కు చెందిన ముఠా పనిగా నిర్ధారణ

కీలక నిందితుడితో పాటు నలుగురి అరెస్ట్



**హైదరాబాద్, డిసెంబర్ 7 (సమ సమాజం):** నాగోల్ మహదేవ్ జ్యువెల్లరీస్లో జరిగిన కాల్పుల ఘటనను రాచకొండ పోలీసులు ఛేదించారు. అందులో భాగంగా పోలీసులు ఎఫ్ఐఆర్లో పది 2లో

## రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం

- మార్కెట్ అంచనాలను నిజం చేస్తూ రెపోరేటు పెంపు
- రెపోరేటును 35 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు గవ్నర్ ప్రకటన
- మరింత భారం కానున్న రుణాల భారం



ముంబై, డిసెంబర్ 7 (సమ సమాజం): రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్ అంచనాలను నిజం చేస్తూ వడ్డీ రేట్లు పెంచింది. రెపోరేటును 35 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. తాజా పెంపుతో రెపో రేటు 6.25శాతానికి పెరిగింది. ఈ ఏడాది 2లో

## విఆర్ఎలకు మద్దతుగా ఉంటాం: రేవంత్



హైదరాబాద్, డిసెంబర్ 7 (సమ సమాజం): విఆర్ఎల ఆందోళనకుకాంగ్రెస్ అండగాఉంటుందని టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థకు వీఆర్ఎలు పట్టుకొమ్మలని ట్విట్టర్ వేదికగా టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'విఆర్ఎలతో గొడ్డు చాకిరి చేయించుకుంటోన్న ప్రభుత్వం వారి సాధకబాధకాలను గాలికి వదిలేసింది. సీఎం హామీలు గాలి మాటలుగా మిగిలాయి. విఆర్ఎల పోరాటానికి కాంగ్రెస్ అండగా ఉంటుంది' అని ట్వీట్ చేశారు.

## అమ్మకానికి గ్రామ పంచాయితీ ట్రాక్టర్

ఇఎంఐలు కట్టలేకనే అంటూ సర్పంచ్ ప్రకటన




**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 7 (సమ సమాజం):** ఈఎంఐలు కట్టలేక గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ను సర్పంచ్ అమ్మకానికి పెట్టారు. గత కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు 2లో

# ఢిల్లీలో బిజెపిని ఊడ్చేసిన ఆప్

## మున్సిపల్ ఎన్నికల్లో తిరుగులేని విజయం





- మేయర్ పీఠం ఇక ఆప్ సొంతం
- 134 స్థానాల్లో ఆప్ ఘన విజయం
- 104 స్థానలకే పరిమితం అయిన బిజెపి
- సత్తా చాటలేకపోయిన కాంగ్రెస్ పార్టీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 7 (సమ సమాజం):** దేశరాజధాని ఢిల్లీలో ఆప్ మరోమారు బిజెపిని ఊడ్చేసింది. తనకు తిరుగులేదని చాటుకుంది. ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి చీపురుకు తిరుగులేదని నిరూపించింది. ఈ నెల 4నజరిగిన ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించింది. ఇన్నాళ్లు ఢిల్లీ కార్పొరేషన్లో బీజేపీ హవానే సాగుతుంది. 15 ఏళ్లుగా బీజేపీనే కార్పొరేషన్ మేయర్ స్థానాన్ని ఆక్రమించింది. కానీ బుధవారం వెలువడిన మున్సిపల్ ఎన్నికల్లో ఫలితాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయ దుందుభి మోగించింది. తొలిసారి పూర్తిస్థాయి మద్దతుతో ఢిల్లీ కార్పొరేషన్ పీఠాన్ని సొంతం చేసుకుంది. 4వ తేదీన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్లో 250 వార్డులకు ఎలక్షన్ జరిగింది. బుధవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ పక్రియలో ప్రారంభం నుంచి బీజేపీ, ఆప్ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. కానీ ఆమ్ ఆద్మీ పార్టీనే విజయం సాధించింది. ఆమ్ ఆద్మీ పార్టీ 134 స్థానాల్లో గెలుపొందగా.. బీజేపీ 104 స్థానాల్లో విజయం సాధించింది. 2లో

## సంపాదకీయం

# కేంద్ర,రాష్ట్రాల మధ్య అపోహలు తొలగాలి

ప్రపంచంలోనే మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. అలాగే ఫెడరల్ వ్యవస్థతో ఏర్పడ్డ రాజ్యాంగం మనది. ఇక 2024లో ఎన్డీఏ రెండో ప్రభుత్వ ఐదేళ్ల గడువు ముగుస్తుంది. 2024లోగా మన యువతకు ఉపాధి అవకాశాలను విస్తరింపజేసి, శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యమిస్తూ, ప్రజల జీవన స్థితిగతులను పెంపొందించడమే నరేంద్రమోదీ ప్రభుత్వ మహా లక్ష్యంగా చెప్పుకుంది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ అనేక హామీలను ప్రకటించారు.ప్రస్తుతం ప్రపంచంలో మన దేశం ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ఇది ఒడిదుడుకులకు లోనుకాకుండా చూడాలి. దేశంలో పెరుగుతున్న జనాభా, సమస్యలపై పరస్పర అవగాహనతో ముందుకు సాగాల్సిన సమయమిది. అందుకే పార్లమెంట్ అన్నది ప్రజల ఆకాంక్ష లకు అనుగుణంగా పనిచేస్తేనే ఫలితాలు వస్తాయి. కేంద్ర,రాష్ట్రాల సంబంధాలు కూడా బలపడతాయి. ఈ క్రమంలో కేంద్ర రాష్ట్రాల సంబంధాలు కూడా బలంగా ఉంటేనే దేశం పురోగమించగలదు. అభివృద్ధి అన్నది సాగగలదు. పార్లమెంట్ సమావేశలు బుధవారం నుంచి జరుగుతున్న వేళ కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న అపోహలు తొలగిపోయేలా సుహృద్భావ వాతావరణంలో ప్రజల సమస్యలపై చర్చలు సాగాలి. ప్రధానంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న అనేకానేక సమస్యలపై ప్రస్తావనకు పార్లమెంటులో అవకాశం ఇవ్వాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు రాష్ట్రాల అధికారాలు, విధులపైనా అవసరమైన పక్షంలో చర్చ చేయాలి. ప్రజలకు కూడా విషయాలు తెలియాలి. నిజానికి రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని వేర్వేరుగానే చూడాలి. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాల పై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ భావన తొలగిపోవాలి. అలాగే నిర్ణయాలను త్వరితంగా తీసుకోగలగాలి. నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం కారణంగా దేశాభివృద్ధి పనులు వెనకంజ వేస్తున్నాయి. నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాలి. రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షించే అవకాశాలు ఉండాలి. కానీ అలాంటి వాతావరణం కనబడదం లేదు. ఇటీవల ఏ సమావేశం జరిగినా తెలంగాణ నుంచి సిఎం కెసిఆర్ ఢిల్లీకి వెళ్లడం లేదు. ఇది ఓ రకంగా ధిక్కారం కిందకే వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో చర్యలు తీసుకునే వెసలుబాటు కూడా ఉండాలి. జి20 బాధ్యతలు చేపట్టిన సందర్భంలో సిఎంలకు ఆహ్వానం అందినా కెసిఆర్ వెళ్లలేదు. ఇది ఓ రకంగా ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే విషయంగానే చూడాలి. ఇలాంటి సందర్భాల్లో కేంద్రాన్ని తప్పు పట్టలేం. నిజానికి కేంద్ర,రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సమస్యలపై చర్చలు, కేంద్రంతో చర్చల విషయంలో పార్టీ అన్నది అడ్డుగోడ కారాదు. ప్రధాని నెలలో ఒకరోజయినా ఒక్కో రాష్ట్రానికి సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు,ఆర్థిక స్థితిగతులు, పథకాల అమలుపై చర్చించాలి. నీతి ఆయోగ్ సమావేశలను కూడా కనీసం మూడు నెలలకో మారయినా సమావేశ పరచి చర్చిస్తే మంచిది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు,విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. సిఎం కెసిఆర్ కావచ్చు..జగన్ కావచ్చు.. మమతా బెనర్జీ కావచ్చు..లేదా మరే ఇతర రాష్ట్ర సిఎం అయినా కావచ్చు పాలనాపరమైన విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. పార్టీలు ఏవైనా అధికారంలో ఉన్నది ఎవరైనా కేంద్రంతో నిరంతరాయంగా అనుసంధానం అవుతూనే ఉండాలి. ఏ ముఖ్యమంత్రి అయినాఢిల్లీ పర్యటనకు వెళ్లడం వంటివి రాజకీయ కోణంలో చూడరాదు. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం , చర్చించడం సర్వసాధారణం అయిన విషయంగా మారాలి.. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జిఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉంటున్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరిం చుకోవడం సిఎంల కర్తవ్యం. ఇవన్నీ చక్కబెట్టుకోవడం కోసం ఢిల్లీకి వెళ్లాల్సిందే. కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. కేంద్రం కూడా పెద్దన్న ధోరణిలో ముందుకు సాగుతూ రాష్ట్రాలను కలుపుకుని పోవాలి. ఎన్నికల సమయంలోనే రాజకీయం అన్నది గుర్తించాలి. రాష్ట్రాలను పీడించడం వల్ల జరిగే నష్టం ప్రజలకే అని గుర్తించాలి. పథకాలకు సంబంధించిన నిధుల విడుదలను తమ సొంత జేబుల్లోంచి ఇస్తున్నట్లుగా కేంద్రం ప్రచారం చేసుకోవం కూడా తగదు. స్వతంత్ర భారతదేశానికి 2022లో 75 ఏళ్లు నిండాయి. స్వాతంత్య్ర అమృతోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నాం. అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేయడం తన సంకల్పాల్లో ముఖ్యమైనదని తొలినాళ్లలో మోడీ ప్రకటించారు. అయినా ఆ హామీ నెరవేరలేదు. అందుకే కలసి పనిచేసే పరిస్థితులు రావాలి. అప్పుడే సమగ్రత సాధ్య మవుతుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## కస్తూర్బా భవనాన్ని పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి

జనగామ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): రాజారాం గ్రామంలో కొత్తగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా విద్యార్థులకు ఇటీవల కొత్త భవనం అందుబాటులోకి రాగా.. విద్యార్థులకు భవనంలోకి తరలించారు. ఈ నేపథ్యంలో విద్యాలయాన్ని సందర్శించారు. వసతులు, వంట తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి, బోధనపై ఆరా తీశారు. వంటశాలలకు వెళ్లి వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడగా.. సీసీ కెమెరాలు, ప్రహరీ, ల్యాబ్ వసతులు కల్పించాలని మంత్రిని కోరారు. ఈ మేరకు ఆయా వసతుల కల్పనకు మంత్రి హామీ ఇచ్చారు.

## పై ఓవర్లు..రోడ్లు వేస్తేనే అభివృద్ధా

దగ్గరకు వస్తున్నారని చెప్పారు. నాలుగు ఫ్లై ఓవర్ లు, రెండు రోడ్లు వేస్తే అభివృద్ధా ? అని ప్రశ్నించారు. కార్యకర్తలు కోరుకున్న అభ్యర్థికే టిక్కెట్ వస్తుందని కోమటిరెడ్డి అన్నారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న ఆయన... గెలిచిన ఎమ్మెల్యే లను పార్టీలో చేర్చుకుని టీఆర్ఎస్ బలం అనుకుంటోందన్నారు. చిరుమర్తి లింగయ్య భార్య కూడా కాంగ్రెస్ లోనే ఉందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోనియా, రాహుల్ గాంధీలను ఈడీ ఆఫీసుకు పిలిచి మరీ విచారణ చేశారని చెప్పారు. కవితకు మాత్రం ఎందుకు మినహాయింపు అని నిలదీశారు. కవిత ఇంటికి వెళ్లి ఎందుకు విచారణ చేయాలి..? సీబీఐ ఆఫీస్ కు ఎందుకు పిలవడం లేదు.. ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ను ఖతం చేసేందుకు బీజేపీ, టీఆర్ఎస్ పన్నాగం పన్నాయని కోమటిరెడ్డి ఆరోపించారు.

## రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం



ఆర్బీఐ వడ్డీ రేట్లు పెంచడం వరుసగా ఐదోసారి. ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థికవృద్ధి నెమ్మదించడం తదితర కారణాలతో ఆర్బీఐ వడ్డీ రేట్ల పెంపును కాస్త తగ్గించినట్లు తెలుస్తోంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగానే వడ్డీ రేట్లు పెంచినట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ అనంతరం ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగిందని అన్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ఇన్?ప్లేషన్ రేటు 6.7 శాతంగా ఉండొచ్చని రిజర్వ్ బ్యాంక్ అంచనా వేస్తోంది. ఈ ఏడాది మేలో ఆర్బీఐ రెపో రేటును 40 బేసిస్ పాయింట్లు పెంచింది. ఆ తర్వాత జూన్, ఆగస్టు, సెప్టెంబర్ లోనూ 50 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. దీంతో రెపో రేటు 2019 ఏప్రిల్ నాటి గరిష్ఠానికి చేరింది. ద్రవ్య విధానాన్ని ప్రకటించింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. మూడు రోజులుగా జరుగుతున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య సమీక్ష విధాన సమావేశం బుధవారంతో ముగిసింది. సమావేశం అనంతరం కొత్త ఏడాదికి ముందే సామాన్యులకు షాక్ ఇస్తూ రెపో రేటును 35 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. రెపో రేటు వడ్డీ రేటుపై ప్రభావం చూపుతుంది. దీంతో రెపో రేటు 6.25 శాతానికి పెరిగింది. అంతకుముందు సెప్టెంబర్ 30న సెంట్రల్ బ్యాంక్ రెపో రేటును 5.90 శాతానికి పెంచింది. ద్రవ్యోల్బణం ఇంకా ఆందోళనకరంగానే ఉందని ద్రవ్య సమీక్ష విధానాన్ని ప్రకటిస్తూ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అన్నారు. రెపో రేటును 0.35 శాతం పెంచుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ బుధవారం ప్రకటించారు. ఆ తర్వాత రెపో రేటు 6.25 శాతానికి పెరిగింది. ఆర్థిక నిపుణుల అంచనాలకు అనుగుణంగా ఆర్‌బీఐ రెపోరేట్లను మరో 35 బేసిస్ పాయింట్లను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై సెంట్రల్ బ్యాంక్ వసూలు చేసే వడ్డీరేటు రెపో (ప్రస్తుతం 5.9 శాతం)ను తదుపరి దశల్లో పెంచే విషయంలో దూకుడు ధోరణిని ప్రదర్శించవద్దని ఆర్‌బీఐకు పారిశ్రామిక వేదిక అసోచామ్ విజ్ఞప్తి చేసింది. రెపో రేటు పెరుగుదల బ్యాంకులు ఖాతాదారులకు ఇచ్చే రుణాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. దీంతో రుణం తీసుకునే ఖర్చు పెరుగుతుంది. ఈ ప్రభావం మీరు తీసుకున్న లోన్ పై పడుతుంది. మీరు ప్రతి నెల చెల్లించే ఇఓఎ పెరుగుతుంది. రెపో రేటు పెంపు కారణంగా బ్యాంకుల రుణాల రేట్లు పెరగడం వల్ల వినియోగదారులపై ప్రభావం పడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23లో దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి అంచనాను ప్రపంచ బ్యాంకు మంగళవారం 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ మాట్లాడుతూ.. మరో సంవత్సరం ముగింపునకు వచ్చిందని, దేశంలోనే కాకుండా ప్రపంచంలోని చాలా దేశాల్లో ద్రవ్యోల్బణం రేటు పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా దేశంలో సరఫరా గొలుసు పరిస్థితి సవాళ్లను ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణం రేటు ఎగువ స్థాయిలోనే ఉండగా, బ్యాంక్ క్రెడిట్ వృద్ధి ప్రస్తుతం రెండంకెల కంటే ఎక్కువగా వస్తోందన్నారు. రిజర్వ్ బ్యాంక్ తన గత మూడు మానిటరీ పాలసీ కమిటీ సమావేశాల్లో రెపో రేటును మొత్తం 1.90 శాతం పెంచింది. ఇందులో మేలో 40 బేసిస్ పాయింట్లు, జూన్, ఆగస్టులో 50-50 బేసిస్ పాయింట్లు పెంచారు. ప్రస్తుతం రెపో రేటు 5.90 శాతంగా ఉండగా, నేడు ఆర్‌బీఐ రెపో రేటును 0.35 శాతం పెంచింది. దీంతో రెపో రేటులో 6.25 శాతానికి చేరుకుంది. రెపో రేటు అనేది ఆర్‌బిఐ ద్వారా ఏదైనా బ్యాంకు రుణం ఇచ్చే రేటు. దీని ఆధారంగానే బ్యాంకులు ఖాతాదారులకు రుణాలు ఇస్తాయి. ఇది కాకుండా, రివర్స్ రెపో రేటు అనేది బ్యాంకులకు వారి డిపాజిట్లపై వడ్డీని ఇచ్చే రేటు. రెపో రేటును పెంచడం వలన, బ్యాంకులపై భారం పెరుగుతుంది. బ్యాంకులు వడ్డీ రేటును పెంచడం ద్వారా ఖాతాదారులకు భర్తీ చేస్తాయి.

## ఢిల్లీలో బిజెపిని ఊడ్చేసిన ఆప్



కాంగ్రెస్ పార్టీ తొమ్మిది స్థానాలకి పరిమితం అయింది. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ ఆఫీస్ దగ్గర ఆప్ కార్యకర్తలు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందంగా గడిపారు. 1958లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటైంది. 2012లో మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేశారు. తిరిగి వాటిని ఈ ఏడాది విలీనం చేశారు. ఈ ఏడాది మే 22 నుంచి ఈ పద్ధతి అమల్లోకి వచ్చింది. ఢిల్లీ మున్సిపల్ పీఠంపై గత 15 ఏళ్లుగా బీజేపీనే అధికారంలో ఉంటుంది. 2017లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 181 స్థానాల్లో విజయం సాధించగా.. ఆప్ 48 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీ తిరుగు లేని విజయం కైవసం చేసుకుంది. ఢిల్లీ మేయర్ పీఠాన్ని అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కైవసం చేసుకుంది. ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్‌లోని మొత్తం 250 వార్డులకుగాను ఆప్ 126 వార్డుల్లో గెలిచి మ్యాజిక్ ఫిగర్‌ను దాటేసింది. గత 15 ఏండ్లుగా ఢిల్లీ కార్పొరేషన్‌ను ఏలుతున్న బీజేపీకి ఘోర పరాభవం ఎదురైంది. వరుసగా మూడు పర్యాయాలు మేయర్ పీఠం దక్కించుకున్న బీజేపీ.. ఇప్పుడు 104 వార్డుల్లో మాత్రమే విజయం సాధించింది. ఇక కాంగ్రెస్ పార్టీ కేవలం ఏడు వార్డుల్లో మాత్రమే గెలిచి, మూడు వార్డుల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నది. స్వతంత్ర అభ్యర్థులు మూడు వార్డుల్లో విజయం సాధించారు. ఢిల్లీ నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడాలంటే ఆప్‌ను గెలిపించాలని ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో తమ ప్రభుత్వమే ఉన్నా, ఢిల్లీ కార్పొరేషన్ బీజేపీ చేతిలో ఉండటంతో తమకు ఢిల్లీని క్లీన్ చేసే అవకాశం లేకుండా పోయిందని ఆయన ఢిల్లీ ఓటర్లకు వివరించారు. ఎప్పుడైనా ఢిల్లీ పీఠంపై ఒక పార్టీ ఉంటే, ఢిల్లీ మేయర్ పీఠంపై మరో పార్టీ ఉంటూ వస్తున్నాయని, దాంతో సమన్వయం కొరవడి పారిశుద్ధ్యం పడకేస్తున్నదని ఆయన చెప్పారు. ఈసారి పాత సంప్రదాయాన్ని తిరగరాసి ఢిల్లీ మేయర్ పీఠాన్ని కూడా ఆప్‌కే కట్టబెట్టాలని కోరారు. కేజ్రీవాల్ కోరినట్టుగానే ఢిల్లీ ఓటర్‌లు ఇప్పుడు ఆప్‌కు అధికారం కట్టబెట్టారు.

## అమ్మకానికి గ్రామ పంచాయితీ ట్రాక్టర్

రాకపోవడంతో కిస్తీలు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ రాధ చెబుతున్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం చిక్కువానిపల్లెలో ఈ ఘటన జరిగింది. తొమ్మిది నెలలుగా గ్రామ పంచాయతీకి నిధులు రావడం లేదని సర్పంచ్ రాధ తెలిపారు. నెలనెలా ఠంచనుగా ఈఎంఐలు కట్టడానికి చాలా ఇబ్బందిపడుతున్నామని.. గత్యంతరం లేకనే సోషల్ మీడియాలో అమ్మకానికి పెట్టామన్నారు. డబ్బులు కట్టలేకనే అమ్మకానికి పెడుతున్నట్లు సోషల్ మీడియాలో పెట్టామని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలని సర్పంచ్ రాధ కోరారు

## ఫామ్‌హౌజ్ కేసులో విచారణ

ఒక్క ఫొటోను ఆధారంగా చేసుకుని తన క్లయింట్‌ను కేసులో ఏ7గా చేర్చడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. శ్రీనివాస్ కుటుంబసభ్యులను సైతం సిట్ అధికారులు వేధించారన్న హుల్లా.. ఈ కేసు విషయంలో మీడియా ట్రయల్ నడుస్తోందని అన్నారు. కేసు దర్యాప్తునకు సంబంధించి మీడియాకు ముందే లీకులిస్తున్నారని న్యాయమూర్తికి విన్నవించారు. మధ్యాహ్నం తర్వాత సిట్ వాదనలు వినిపించే అవకాశముంది.

### విపక్షాల అధికారాలను లాగేసుకుంటున్నారు:

## అధీర్ రంజర్

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): పార్లమెంట్‌లోని విపక్ష పార్టీల అధికారాల్ని కేంద్రం లాగేసుకుంటోందని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరీ ఆరోపించారు. ఇవాళ ఆయన లోక్‌సభలో మాట్లాడారు. లోక్‌సభలోని స్థాయి సంఘం చైర్మెన్ పదవులను విపక్షాల నుంచి ప్రభుత్వం లాక్కుంటోందని ఆయన అన్నారు. తమ వద్ద ఉన్న ఐటీ స్టాండింగ్ కమిటీ చైర్మెన్ పదవిని ప్రభుత్వం గుంజుకున్నట్లు అధిర్ ఆరోపించారు. విపక్షాల వద్ద ఉన్న అన్ని హోదాల్ని బీజేపీ సర్కార్ అంతం చేస్తున్నట్లు ఆయన విమర్శించారు. పార్లమెంట్‌లో విపక్షాలకు ఎటువంటి అధికారం దక్కకుండా చూస్తున్నారని అధిర్ ఆరోపించారు.

## ప్రధాని మోడీ షర్మిలకు ఫోన్చేయడంలో ఆంతర్యం



సాగవని అన్నారు. మానుకోటలో కొత్తగా నిర్మించిన మెడికల్ కళాశాల, కలెక్టరేట్ భవనాలను పరిశీలించిన మంత్రి సత్యవతి రాథోడ్... ఈ నెల 15 లోపు ముఖ్యమంత్రి కేసీఆర్ మానుకోటకు వస్తారన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ ఇద్దరు కూడా తెలంగాణ ద్రోహులేనని విమర్శించారు. నోరు, నాలుక అదుపులో పెట్టుకొని పాదయాత్ర చేసుకో అని షర్మినలు ఘాటుగానే మంత్రి సత్యవతి హెచ్చరించారు. ముఖ్యమంత్రి, మంత్రులను, ఎమ్మెల్యేలును, ఎంపీలను ఏమైనా అంటే టీఆర్ఎస్ కార్యకర్తలు ఊరుకోరని, దానికి తాము బాధ్యులం కామన్నారు. బురదజల్లే మాటలు మానాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 2.25 లక్షల ఉద్యోగాలిచ్చింది. ప్రైవేట్ సెక్టార్‌లో 17 లక్షలు జాబ్‌లు కల్పించింది. కేంద్రం ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు పోయేలా ప్రైవేటీకరణ చేస్తున్నదని మంత్రి అన్నారు. ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా రిజర్వేషన్లు ఎత్తేసే కుట్రలో భాగంగా ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెట్టేలా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఇచ్చినన్ని ఉద్యోగాలు మరెక్కడా ఇవ్వలేదన్నారు.

## నాగోల్ దోపిడి కేసును ఛేదించిన పోలీసులు

మందిని చేర్చడంతో పాటు, నలుగురు దొంగలను అరెస్ట్ చేశారు. కీలక నిందితుడు మహేందర్‌తో పాటు సుమిత్, మనీష్, మనియ అరెస్ట్ అయినట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో రూ.లక్షా35వేల900 విలువ గల 2701.8 గ్రాముల బంగారం, రూ.65,500 క్యాష్, 6 మొబైల్స్,3 కంట్రీ మేడ్ పిస్టల్, 1 ఎయిర్ పిస్టల్, బులెట్లు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు స్పష్టం చేశారు. దాంతో పాటు హోండా యాక్టివా, పల్సర్ కంపెనీలకు చెందిన 4 ద్విచక్ర వాహనాలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. డిసెంబర్ 1న 8:30 సమయంలో చైతన్య పురి పోలీస్ స్టేషన్ పరిధిలో మహేదేవ్ జ్యూవెల్లరీ వద్ద ఇద్దరిపై గన్ ఫైర్ చేసి చోరీ జరిగిందనే సమాచారం అందిందని సీపీ మహేష్ భగవత్ చెప్పారు. వెంటనే అక్కడికి చేరుకొని ఎస్వోటీ, సీసీఎస్, క్రైమ్ టీంలను ఫార్మ్ చేశామని, గాయాలైన సుఖ్ దేవ్, సుఖ్ రామ్ ను స్థానిక ఆస్పత్రికి తరలించామన్నారు. మొదట సైంటిఫిక్ ఎవిడెన్స్ ద్వారా దర్యాప్తు చేశామన్న సీపీ.. ముసుగు ధరించి బైక్ పై వచ్చిన నలుగురు గణపతి జ్యువెలరీ నుండి తెచ్చిన గోల్డ్ బ్యాగ్ ఇవ్వాలని అడిగారని, వారు ఇవ్వకపోవడంతో కాల్పులు జరిపి గోల్డ్ తో పరార్ అయ్యారని తెలిపారు. ఒక్కొక్క సీసీ టీవీ కెమెరాలతో ఎవిడెన్స్ కలెక్ట్ చేస్తూ వెళ్ళామన్న సీపీ మహేష్ భగవత్.. నంబర్ ప్లేట్ లేని పల్సర్ బైక్ ను గుర్తించామని, దర్యాప్తులో భాగంగా మరో స్కూటీకి సంబంధించిన చిన్న క్లూ దొరికిందన్నారు. దాని ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసి ఆరుగురిని అరెస్ట్ చేశామని స్పష్టం చేశారు. దోపిడీ తర్వాత వారు పరార్ అవ్వడానికి వాడిన మహేంద్ర వెహికల్ తో పాటు ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రాజస్థాన్ కు చెందిన ప్రధాన సూత్రధారి మహేంద్ర చౌదరి గతంలో గుజరాత్ లో గోల్డ్ షాఫ్ పెట్టాడని, నాలుగేళ్ల క్రితం గజ్వేల్ కు షిఫ్ట్ అయ్యి జ్యూవెల్లరీ షాపు పెట్టాడని తెలిపారు. ఒక గ్యాంగ్ ను ఏర్పాటు చేసి చోరీ చేయించిందీ మహేంద్ర చౌదరీనేనని స్పష్టం చేశారు. దోపిడీ జరుగుతున్న సమయంలో మహేంద్ర చౌదరి ఉప్పల్ లోని ఓ బార్ లో ఉన్నాడని సీపీ వివరించారు.



## ప్రజాసంగ్రామ యాత్రతో కెసిఆర్‌కు నిద్రపట్టడం లేదు

అసహ్యించు కుంటోందన్నారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను సీబీఐ అరెస్ట్ చేస్తే తెలంగాణ సెంటిమెంట్ రగిలించాలని కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఖానాపూర్ లోని పెండింగ్ ప్రాజెక్టులు, బ్రిడ్జిలన్నీ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. డిగ్రీ కాలేజీ, రెవిన్యూ డివిజన్ ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. తాలు ధాన్యం పేరుతో టీఆర్ఎస్ నేతలు రైతులను ఘోరంగా మోసం చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. వడ్ల కొనుగోలు పైసలన్నీ మోదీ ప్రభుత్వమే ఇస్తోందన్నారు. గ్రామ పంచాయతీలకిచ్చే నిధులన్నీ కేంద్రానివే అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక, పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని భరోసా కల్పించారు. నిలువ నీడలేని పేదలకు ఇండ్లు కట్టిస్తామని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు ఫసల్ బీమా యోజన పథకాన్ని పూర్తిగా అమలుచేసి, ఆదుకుంటామని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. ముఖ్యమంత్రిని అడిగే దమ్ము టీఆర్ఎస్ నేతలకు ఉందా? అని ప్రశ్నించారు. కేంద్రం ఇస్తున్న నిధులతోనే... తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందని బండి సంజయ్ చెప్పారు. ధాన్యం సేకరణ కు నిధులు ఇస్తున్నది మోడీ ప్రభుత్వమే అని చెప్పారు. తెలంగాణలో పేదోళ్ల రాజ్యం రావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రం గా మార్చేశారని తెలిపారు. మూడోసారి కేసీఆర్ కు అవకాశం ఇస్తే... ఇంకో రూ. 5 లక్షల కోట్ల అప్పు చేస్తారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం అక్రమంగా సంపాదించిన ఆస్తులతో... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అద్దంలా అభివృద్ధి చేయవచ్చని చెప్పారు. ఖానాపూర్ గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తామని స్పష్టం చేశారు.

## జగదీప్ ధన్కర్ దేశంలోని ఎంతోమందికి స్ఫూర్తి

తెలిపారు. ఈ సందర్భంగా మోడీ రాజ్యసభలో మాట్లాడుతూ ఎన్నో బాధ్యతలను ధన్కర్ సమర్ధవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రైతుబిడ్డ ఉపరాష్ట్రపతిగా ఎన్నకవడం సంతోషంగా ఉందని మోడీ తెలిపారు. ధన్కర్‌కు చట్టాలపై ఎంతో అవగాహన ఉందన్నారు. ఈ సభతో పాటు దేశం తరుపున ధన్కర్‌కు అభినందనలు తెలిపారు. జీ20 బాధ్యతలు చేపట్టిన సమయంలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నా యని మోడీ అన్నారు. జీ20 సదస్సుకు సన్నద్ధం కావాల్సిన సమయమిదన్నారు. ప్రజాసమస్యలపై చర్చించేందుకు పార్లమెంట్ మంచి వేదిక అని చెప్పారు. ఇది అమృతకాలం ప్రారంభసమయమన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సులభంగా బాధ్యతతో సాధించడంలో మన పార్లమెంటు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని మోడీ అన్నారు. దేశానికి రాజ్యసభ అతిపెద్ద బలం అని.. మన ప్రధానులు చాలా మంది రాజ్యసభ సభ్యులుగా పనిచేశారని చెప్పారు. అంతుకుముందు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు విపక్షాలు సహకరించాలని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్దంగా ఉందన్నారు. జీ-20 సదస్సును భారత్ నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ సమావేశాలు భారత్‌కు చాలా కీలకమన్నారు. కొత్త ఎంపీలకు , యువ ఎంపీలకు ప్రజాసమస్యలను ప్రస్తావించేందుకు సభలో అవకాశం లభించాలన్నారు ప్రధాని మోదీ. మూడు వారాల పాటు జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి వారం వేడిగా ఉండే అవకాశం ఉంది. పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్నప్పుడు ప్రధాన మంత్రి, చైర్మన్‌కి సభతో పాటు దేశం తరపున కూడా అభినందనలు తెలిపారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముందు, సమావేశాలను మరింత ఉత్పాదకంగా మార్చేందుకు అన్ని పార్టీలు సమిష్టిగా కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం అభ్యర్థించారు. భారతదేశం యొక్క ఉ20 ప్రెసిడెన్సీని ప్రస్తావిస్తూ, అతను ఇలా అన్నారు. జి 20 సమ్మిట్ కేవలం దౌత్య కార్యక్రమం కాదు, ఇది భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచం ముందు ప్రదర్శించడానికి ఒక అవకాశం. ఇంత పెద్ద దేశం, ప్రజాస్వామ్యానికి తల్లి, అటువంటి వైవిధ్యం, అటువంటి సామర్థ్యం ప్రపంచా నికి భారతదేశాన్ని తెలుసుకోవడం. భారతదేశం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించడానికి ఇది ఒక అవకాశం అన్నారు. ఇదిలావుంటే పరిశీలన, ఆమోదం కోసం 16 కొత్త బిల్లులను రూపొందించిన ప్రభుత్వాన్ని

## రైలుకు ప్లాట్ పామ్ మధ్య ఇరుక్కున్న విద్యార్థి

**గంటపాటు శ్రమించి రక్షించిన రైల్వే సిబ్బంది**

విశాఖపట్టణం,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): రైల్వే ప్రయాణికులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆశాఖ అధికారులు హెచ్చరిస్తున్నా ..అజాగ్రత్తతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏపీలోని దువ్వాడ రైల్వేస్టేషన్‌లో శశికళ అనే ఎంసీఏ విద్యార్థి రైలు దిగుతుండగా ఒక్కసారిగా రైలు, ప్లాట్‌ఫాం మధ్య ఇరుక్కుపోయింది. ఆ సమయంలో రైలు ఆగి ఉండడంతో ఆమెకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. అన్నవరానికి చెందిన విద్యార్థిని శశికళ రోజుమాదిరిగానే దువ్వాడలోని ఓ కళాశాలలో చదువుకునేందుకు రైలులో రాకపోకలు కొనసాగిస్తుంది. బుధవారం గుంటూరు -రాయగఢ ఎక్స్‌ప్రెస్ దిగుతున్న ఆమె రైలుకు-ఎ÷-లాట్‌ఫాంకు మధ్య ఇరుక్కుపోయింది. దీంతో ఆమెను బయటకు తీసేందుకు రైల్వే సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. రైలు కదిలితే విద్యార్థినికి ప్రమాదం జరిగే అవకాశముండడంతో ఆమెను సురక్షితంగా కాపాడేందుకు రైల్వే సిబ్బంది, పోలీసులు, సహాయక బృందాలు రంగంలోకి దిగి గంటపాటు శ్రమించారు. ఈ సమయంలో ఆమె తీవ్రంగా ఇబ్బందులకు గురైంది. చివరకు ఆమెను స్వల్పగాయాలతో బయటకు తీసి సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు.

# గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి




**చలో రాజ్‌భవన్‌కు సిపిఐ పిలుపు**

**భారీగా తరలివచ్చిన సిపిఐ శ్రేణులు**

**నేతలు సహా కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు**

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ... బుధవారం 'చలో రాజ్‌భవన్' కార్యక్రమానికి సిపిఐ పిలుపునిచ్చింది. భారీగా చేరుకున్న సిపిఐ నేతలు, కార్యకర్తలు రాజ్‌భవన్ ముట్టడికి వెళుతుండగా... ఖైరతాబాద్ సర్కిల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో.. అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకొని పోలీసులకు, సిపిఐ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ .... గవర్నర్ వ్యవస్థ ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా పనిచేసినట్టు ఇప్పటివరకు ఆధారాలు లేవని, గవర్నర్ వ్యవస్థతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదని, అందుకే ఈ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర గవర్నర్ తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు.ఈ క్రమంలో.. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్ రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. కూనంనేని, చాడల అరెస్ట్‌పై సిపిఐ కార్యకర్తలు నిరసనకు దిగారు. అంతకు ముందు మీడియాతో కూనంనేని మాట్లాడుతూ.. కవితపై కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని, అసలు లిక్కర్ కేసు ఏంటో అర్థం కావడం లేదన్నారు. టిడిపిలో ఉన్నప్పుడు సుజనా చౌదరి, సిఎం రమేష్ లపై దాడులు చేశారన్నారు. వాళు బిజెపిలో చేరగానే పునితులయ్యారని, షర్మిలకు మోడీ ఫోన్ చేసి పలకరించే సమయం ఉంది కానీ బిజెపి రాష్ట్రాల్లో మహిళలపై దాడులు.. హత్యలు చేసిన బాధితులను పరామర్శించే సమయం లేదని ఎద్దేవా చేశారు. మోడీ రాజనీతిజ్ఞుడు కాదని, గవర్నర్ వ్యవస్థతో ప్రయోజనం లేదన్నారు. ప్రయోజనం కంటే ప్రమాదమే ఎక్కువ అని కూనంనేని స్పష్టం చేశారు.

# ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో దూసుకుపోతున్న ఆప్

**మెజార్టీ స్థానాల్లో ఆప్ అభ్యర్థుల ముందంజ**

**ఫలితాలతో ఆప్ కార్యకర్తల్లో జోష్**

**తొలిసారిగా ఆప్‌నుంచి గెలిచిన ట్రాన్స్‌జెండర్**

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో ఆప్ దూసకెళ్తోంది. ఆ పార్టీ ఇప్పటికే 107 స్థానల్లో విజయం సాధించగా.. 20 స్థానాల్లో లీడ్‌లో ఉంది. బీజేపీ 84 స్థానాల్లో గెలిపొందగా.. 20 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ 5 స్థానాల్లో విక్టరీ కొట్టగా మరో 5 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మరోవైపు ఆప్ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. కేజ్రీవాల్ ఇంటివద్దకు ఆ పార్టీ శ్రేణులు భారీగా చేరుకున్నారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 250 వార్డులకు డిసెంబర్ 4న ఎన్నికలు జరిగాయి. మ్యాజిక్ ఫిగర్ సాధించేందుకు అవసరమైన 126 వార్డులను సునాయాసంగా కైవసం చేసుకునే దిశగా ఆప్ దూసుకెళుతోంది. ఎంసీడీ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తుండటంతో ఆప్ శ్రేణులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. మూడు బాడీలుగా ఉన్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఒకే గొడుగు కిందకు తెచ్చింది కేంద్రం ప్రభుత్వం. ఈ ఏడాది మేలో బిల్లు పెట్టి.. ఈస్ట్ ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్, నార్త్ ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్, సౌత్ ఢిల్లీ కార్పోరేషన్లను రద్దు చేసి.. మూడింటిని కలిపి ఒకే మున్సిపల్ కార్పోరేషన్ గా ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్పోరేషన్ ఆఫ్ ఢిల్లీగా ఏర్పాటు చేసి.. వార్డులను 250స్థానాలకు కుదించారు. మొత్తం 250 వార్డులకు గాను 1349 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అన్ని పార్టీలు ఢిల్లీ మున్సిపల్ ఎన్నికలను సవాల్ గా తీసుకున్నాయి. ఇదిలావుంటే ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఓ ట్రాన్స్ జెండర్ విజయం సాధించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ట్రాన్స్ జెండర్ అభ్యర్థి బాబీ కిన్నార్.. సుల్తాన్ పురిఏ వార్డు నుంచి విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. బాబీ 6,714 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి వరుణ ధాకా పై గెలిచారు. తనను గెలిపించిన వారికి బాబీ ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో అవినీతిని పారద్రోలేందుకు పోరాటం చేస్తానని చెప్పారు. తన నియోజకవర్గాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. బాబీ కిన్నార్ సామాజిక కార్యకర్త. అన్నా హజారే తో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి పనిచేశారు. 2017లో జరిగిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి బాబీ కిన్నార్ కు టికెట్ ఇచ్చింది. ఓ ట్రాన్స్ జెండర్ అభ్యర్థికి ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్ ఇవ్వడం ఇదే తొలిసారి. కాగా ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ముందు వరుసలో ఉంది. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఆప్ ముందు వరుసలో ఉంది. దీంతో ఆప్ గెలుపు ఖాయం అని పార్టీ వర్గాలు సంబరాలు చేసుకుంటున్నాయి.

## డాక్టర్ వసంత్‌ను బుజ్జగించిన ఎమ్మెల్యే రాజాసింగ్

**కరోనా వైద్యంపై కిషన్ రెడ్డితో మాట్లాడుతానని హామీ**

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ):సుల్తాన్ బజార్ యూపీహెచ్సీలో డాక్టర్ వసంత్ మూడు రోజులుగా తలుపులు వేసుకుని దీక్ష చేస్తున్నారు. దీనిపై గోశామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి.. దీక్షను విరమించాలని వసంత్‌ను కోరారు. ఆందోళన చేస్తున్న డాక్టర్‌కు సంఘీభావం తెలిపిన ఆయన.. తలుపులు తెరిచి బయటికి రావాలని అన్నారు. పోలీసులు వెళిపోతేనే బయటకు వస్తానని చెప్పిన వసంత్.. చివరికి తలుపులు తెరిచారు. అతడితో మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రాజాసింగ్ హామీ ఇచ్చారు. తాను కేవలం రూ.45కే ఐదు రోజుల్లో కోవిడ్ ను పూర్తిగా నయం చేస్తానని చెబుతున్నా.. అధికారులు,ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వసంత్ ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ వసంత్ అంశం మాట్లాడేందుకు మంత్రి హరీష్ రావుకు ఫోన్ చేస్తే స్పందించలేదని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలు లెక్కచేయకుండా విధులు నిర్వహించిన వైద్యుల పట్ల ప్రభుత్వానికి చిన్న చూపు తగదని అసహనం వ్యక్తం చేశారు. డాక్టర్ వసంత్ అంశాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వివరించానని తెలిపారు.

# అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తెలంగాణ




ఇలాగే కొనసాగించడనాఇకి ప్రజలంతా కదలిరావాలన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యావత్ దేశానికి దిక్సూచీగా ఉన్నాయన్నారు. తెలంగాణ మాదిరిగానే కేంద్రం కూడా పనిచేస్తే.. రాష్ట్ర బడ్జెట్ 14.5 లక్షల కోట్లు ఉండేదని తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన సీఎం కేసీఆర్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా టిఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత వైద్య కళాశాలకు శంకుస్థాపన చేశారు..27 ఎకరాల్లో 510 కోట్ల ఖర్చుతో ఈ మెడికల్ కాలేజ్ బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారు. అనంతరం కలెక్టరేట్ భవన సముదాయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. జగిత్యాల కలెక్టరేట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత నిర్మించిన 14వ కలెక్టరేట్ అన్నారు. దేశంలో అత్యధిక జీతాలు అందుకుంటున్నది మన ఉద్యోగులేనని తెలిపారు. గతంలో తెలంగాణలో కారుచీకట్లు ఉండేవి.. కానీ ఇప్పుడు అభివృద్ధి పథంలో దూసుకెళున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ. 62 వేల కోట్ల బడ్జెట్ ఉంటే.. ఈసారి రూ. 2 లక్షల 20వేల కోట్లు దాటిపోనుందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. మంచి చక్కటి పరిపాలన భవనాన్ని నిర్మించుకుని నా చేతుల మీదుగా ప్రారంభించుకున్నందుకు ప్రజా ప్రతినిధులకు, అదికారులకు, ప్రజలకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని కేసీఆర్ తెలిపారు. నూతన కలెక్టరేట్‌లలో ఇది 14వ కలెక్టరేట్. మిగతావికి కూడా త్వరలోనే ప్రారంభం చేసుకోబోతున్నాం. తెలంగాణ ఉద్యమ సందర్భంలో అనేకసార్లు మీ వద్దకు వచ్చాను. రాజకీయ నాయకులుగా ఉద్యమం చేసే సందర్భంలో మీరు కూడా పెన్ డౌన్ చేసి తెలంగాణ కోసం పోరాటం చేశారు. తెలంగాణ ఏర్పడుతుంది. దీనికి మంచి అవకాశాలు ఉన్నాయి. ధనిక రాష్ట్రం అవుతుందని ఆనాడే చెప్పాను. అత్యుత్తమ శాలరీలు వస్తాయని చెప్పాను. అది నిజమైంది. ఎవర్నీ వదలకుండా అన్ని వర్గాలు ప్రతి ఒక్కరికి మేలు జరిగే విధంగా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామని కేసీఆర్ తెలిపారు. పరిపాలన చేసే వారు రాజ్య కార్యాన్ని నిర్వహించే వారు న్యాయ మార్గంలో పరిపాలించాలని చెప్పారు. జనమంతా సుఖంగా ఉండాలని కోరుతారు. బేధాభిప్రాయం లేకుండా తెలంగాణ మనదే అని చెప్పి అనేక కార్యక్రమాలు శ్రీకారం చుట్టాం. విజయవంతం అయ్యాయి. ఈ విషయాలన్నీ మీకు తెలుసు. రాష్ట్రం ఏర్పడప్పుడు అనిశ్చిత స్థితి. కరెంట్ బాధలు, సాగునీళ్లు లేవు. వలసలు, కరువు. కారు చీకట్లలాంటి పరిస్థితి. కానీ అన్ని సమస్యలను అనతి కాలంలోనే అధిగమించామని కెసిఆర్ చెప్పారు. అనేక మంది ఆర్థిక శాస్త్రవేత్తలతో చర్చించి, సరైన అంచనాలు వేసి రాష్ట్రం ప్రస్థానాన్ని ప్రారంభించుకున్నామని కేసీఆర్ తెలిపారు. దేశంలో అనేక విషయాల్లో మనం నంబర్ వన్ ఉన్నాం. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌తో పాటు పలు రాష్ట్రాలను జీఎస్‌డీపీలో, పంటల ఉత్పత్తి, తలసరి విద్యుత్ వినియోగంతో పాటు అనేక రంగాల్లో నంబర్ వన్‌గా ఉన్నాం. ఇదంతా సాధ్యమైందంటే ఒక కేసీఆర్, ఒక సీఎస్, మంత్రులతో కాదు మనందరి సమష్టి కృషి అని పేర్కొన్నారు. కరువులు, వలసలతో ఉన్న తెలంగాణ.. అనతి కాలంలోనే ఉన్నత స్థాయి చేరుకుంది. అద్భుతమైన ప్రగతి ప్రస్థానాన్ని సాధించాం. దేశానికే ఆదర్శంగా నిలిచాం. మనం కచ్చితంగా బాగుపడాలనే అభిప్రాయంతో అందరం కష్టపడ్డామని కేసీఆర్ స్పష్టం చేశారు. గురుకుల విద్యలో మనకు మనమే సాటని, ఇండియాలో పోటీగానీ, సాటిగానీ లేరన్నారు. 'రాష్ట్రంలో వెయ్యికిపైగా గురుకుల పాఠశాలలు, కళాశాలలను అన్నివర్గాలకు స్థాపించుకున్నాం. అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయి. ఎవరూ ఊహించనటువంటి రీతిలో 33 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుంటున్నాం. కేంద్రం సహకరించకపోయినా నిర్మించుకుంటున్నాం. జగిత్యాలలో కాలేజీని రూ.108 కోట్లతో కళాశాల, వైద్యశాఖలకు శంకుస్థాపన చేసుకున్నాం. ఛత్తీస్‌గఢ్‌లో మాజీ సెక్రెటరీ ఉన్నారు. ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా ఆయనపై ఉండే గౌరవంతో ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నారు. కేరళ రాష్ట్రం కంటే బస్తర్ జిల్లా పెద్దగా ఉందని.. ఆరేడు జిల్లాలుగా విభజించారు. ఒకటే అసెంబ్లీ నియోజకవర్గంగా ఉందని, భౌగోళిక విస్తృతి బాగుంది.. ఏం చేయమంటారని అడిగితే.. జిల్లాలుగా చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు అడ్మినిస్ట్రేషన్ వెలుగులు వస్తేనే.. ఆశించిన స్థాయిలో ప్రగతి సాధ్యమవుతుందని చెప్పారు' అని కేసీఆర్ తెలిపారు. దేశంలో అనేక రంగాల్లో మనమే నెంబర్1గా ఉన్నామని తెలిపారు. అన్ని వర్గాలకు 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అంటూ కేసీఆర్ పేర్కొన్నారు. 33 జిల్లాల్లో 33 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 2016 రూపాయల వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నామని, రైతుబంధు ఇస్తున్నామని తెలిపారు. అయితే, రైతు బంధు అందరికీ ఎందుకు అని ప్రశ్నిస్తున్నారని.. రాష్ట్రంలో 93 శాతం రైతులకు భూమి 5 ఎకరాలలోపే ఉందని తెలిపారు. 25 ఎకరాలకు మించి ఉన్న రైతులు 0.25 మాత్రమే ఉన్నారని.. వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితి ఏమాత్రం బాగోలేదు

**మల్లికార్జున ఖర్గేకు నివేదిక ఇస్తానన్న జగ్గారెడ్డి**



న్యూఢి÷-లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేని మర్యాదపూర్వకంగా కలవడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఢిల్లీకి వచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై ఆయనతో చర్చిస్తానని తెలిపారు. కొద్ది రోజులుగా రాష్ట్ర కాంగ్రెస్ లో పరిస్థితులు బాగోలేవని.. సీనియర్లు, జూనియర్లకు మధ్య గ్యాప్ వచ్చిందని చెప్పారు. దీనిపై కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్?లో టీఆర్ఎస్ నాయకుల పాత్రపై కాంగ్రెస్ పార్టీ పోరాడాల్సి ఉందని జగ్గారెడ్డి అన్నారు. టీపీసీసీతో, సీఎల్పీ లీడర్ తో మాట్లాడి ఢిల్లీ లిక్కర్ స్కాంపై పోరాటం చేస్తామన్నారు. బీజేపీ, టీఆర్ఎస్ మధ్యనే ప్రచారం కొనసాగుతోందని జగ్గారెడ్డి అన్నారు. బీజేపీ, టీఆర్ఎస్ పరస్పర విమర్శలు చేసుకుంటూ.. కాంగ్రెస్ కు ఉనికి లేకుండా చేయాలని చూస్తున్నాయని ఆయన మండిపడ్డారు. మునుగోడు ఉపఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని చెప్పారు. ప్రజలకు చేరువలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎందుకు వార్తల్లో ఉండటం లేదో తెలియాలన్నారు. టీపీసీసీ నిర్ణయాల్లో కూడా కేంద్ర కాంగ్రెస్ నాయకత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. టీపీసీసీ అందరిని కలుపుకుని నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు.

## లెఫ్ట్ పార్టీలను వేస్ట్ అన్న కెసిఆర్ వారితోనే జతకట్టారు :వివేక్



హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ):టీఆర్ఎస్‌పై ప్రజలకు ఎలాంటి అభిప్రాయం ఉందో దుబ్బాక, జీహెచ్ఎంసీ, మునుగోడు ఎన్నికలతో తేలిందని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి అన్నారు. టీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరని.. గత 8ఏళ్లుగా మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని అబద్దాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం,లిక్కర్, క్యాసినో అవినీతిలో టీఆర్ఎస్ మునిగిపోయిందని ఆరోపించారు. కేటీఆర్ ఓ ఫెయిల్యూర్ లీడర్ అని..కేటీఆర్ ఎక్కడ ప్రచారం చేస్తే అక్కడ టీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతుందన్నారు. టీఆర్ఎస్ నాయకత్వం మొత్తం మునుగోడులో ప్రచారం చేసినా..కేవలం 10వేల మెజారిటీ రావడం సిగ్గుచేటన్నారు.లెఫ్ట్ పార్టీలు వేస్ట్ అన్న కేసీఆర్.. ఇప్పుడు వాళ్ళతోనే జతకట్టారని విమర్శించారు. మునుగొడులో నైతిక విజయం బీజేపీదేనన్నారు. ప్రజాసంగ్రామయాత్రతో రాష్ట్రంలో బీజేపీ బలమైన పార్టీగా మారిందన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కేసులను సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలి

**ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసులపై జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం**

**నిర్వహించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి, డిసెంబర్,07(సమ సమాజం): ఎస్సీ, ఎస్టీ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ సంభందిత కమిటీ సభ్యులకు, పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ అదనపు కలెక్టర్ లు వి.లక్ష్మీ నారాయణ కుమార్ దీపక్ లతో కలిసి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాధితులకు నష్టపరిహారం చెల్లింపులపై చర్చించారు. నూతనంగా ఏర్పడిన విజిలెన్స్ కమిటీ సభ్యులకు కలెక్టర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కల్పించారు. 2021 డిసెంబర్ 31 నాటికి కోర్ట్ లో 169 కేసులు పెండింగ్ లో ఉండగా, 2022 జనవరి ఒకటి నుండి అక్టోబర్ 31 వరకు 18 కేసులు నమోదు అయినాయని, మొత్తం 187 కేసులకు గాను 30 పరిష్కారం కాగా, 157 కేసులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. 2022-23 సంవత్సరానికి గాను 84 కేసులకు గాను 37 కేసులకు 28 లక్షల 37 వేల 500 రూపాయలు నష్ట పరిహారం అందించగా, ఇంకను 47 కేసులకు నష్టపరిహారం చెల్లించవలసి ఉన్నదని తెలిపారు. బ్యాంక్ అకౌంట్ డీటైల్స్, బడ్జెట్ తెప్పించి పెండింగ్ వాటికి చెల్లింపులు చేయాలని తెలిపారు. పోలీస్ వారి ఛార్జ్ షీట్ ప్రకారం పెండింగ్ లేకుండా వెంట వెంటనే పరిశీలన చేసి క్లియర్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కేసులు ఎందుకు పెండింగ్ లో ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో తదుపరి కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూడాలని, తదుపరి కమిటీ సమావేశానికి ప్రస్తుతం ఉన్న పెండింగ్ కేసులను క్లియర్ చేసి రిపోర్ట్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా షెడ్యూల్ తెగల అధికారి ఎం. గంగారం, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నాగలేశ్వర్, గోదావరిఖని ఏ.సి.పి. గిరిప్రసాద్, కరీంనగర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పవన్ కుమార్, విజిలెన్స్, మానిటరింగ్, కమిటీ సభ్యులు, యాసర్ల రాజ్ కుమార్ (తిమోతి), మదనయ్య, వెంకటేశం,సాయిరాం నాయక్, ఎన్.జి. ఓలు రాజయ్య, రాజగోపాల్, టి.ఎస్.ఎన్.పి.డి.సి.ఎల్ సూపరింటెండెంట్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటాలన్న ఆలోచన తీసుకుని వచ్చాం

**గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌తో మార్పు తెచ్చాం**


**జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన ఎంపి సంతోష్**



సిద్దిపేట,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): వేడుక ఏదైనా మొక్క నాటాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో తీసుకురావడంతో గ్రీన్ ఇండియా చాలెంజ్ మొదటి విజయాన్ని సాధించిందని ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. విదేశాల్లో ఉన్న తెలుగువారు కూడా గ్రీన్ ఇండియా చాలెంజ్ స్ఫూర్తితో మొక్కలు నాటడం గొప్ప విషయమన్నారు. ఆలోచనలను ఆచరణగా మార్చి లక్ష్య సాధన కోసం కృషిచేయడంలోనే నిజమైన విజయం ఉందన్న స్ఫూర్తిని బలంగా నమ్మడంతోనే ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాలకు దగ్గర చేయగలిగామని వెల్లడించారు. బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా ములుగు ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో సంతోష్ కుమార్ మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఫారెస్ట్ కాలేజీలో విద్యను అభ్యసిస్తున్న వందలాది మంది విద్యార్థుల మధ్య పుట్టినరోజు వేడుకలను మొక్కలు నాటడం ద్వారా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆలోచనలను అశయాలుగా మార్చి వాటి సాధనకు కృషి చేయటం ఉద్యమ కాలం నుంచి సీఎం కేసీఆర్ ఆచరణలో పెట్టారు. అదే స్ఫూర్తి నుంచి ప్రేరణ పొందుతూ గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. బీడుగా ఉన్న రాష్ట్రాన్ని స్వరాష్ట్ర సాధన తర్వాత హరిత మయంగా మార్చాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని తీసుకున్నారని, దానినుంచే స్ఫూర్తి పొంది తాను గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించాన్నారు. గత ఐదేండ్లుగా కొనసాగుతున్న గ్రీన్ ఇండియా చాలెంజ్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు, అన్ని వర్గాలకు చేరుకోవటం చాలా ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఇప్పుడు ఎక్కడకు వెళ్లినా ఆకుపచ్చని ఫలితాలు కళ్లముందు కనిపిస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో హరితహారం, గ్రీన్ ఇండియా చాలెంజ్ విజయవంతం చేసుకుని అదే మాదిరిగా.. దేశవ్యాప్తంగా ఆకుపచ్చని ఉద్యమం చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఆ దిశగా గ్రీన్ ఇండియా చాలెంజ్ సమాజంలోని అన్ని వర్గాలను మరింతగా భాగస్వామ్యం చేసేలా కృషి చేస్తుందని ఎంపీ అన్నారు. ఇప్పటి దాకా స్వచ్ఛందంగా ఈ ఉద్యమంలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికి ఎంపీ సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్, బీసీ కమిషన్ సభ్యులు కిషోర్ గౌడ్, ఫారెస్ట్ కాలేజ్ డీన్ ప్రియాంక వర్గీస్, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్స్ కరుణాకర్ రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాజ్యసభ సభ్యులు సంతోశ్ కుమార్‌కు ఎమ్మెల్సీ కవిత పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'పుట్టిన రోజు శుభాకాంక్షలు అన్న' అంటూ కవిత ట్వీట్ చేశారు.




# చలన చిత్రం



## బాలయ్య కొత్త చిత్రానికి నేడు ముహూర్తం

### అనిల్ రావిపూడి దర్శకత్వంలో ప్రారంభం

ఎన్బీకే 108 ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదిరింది. నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న 108వ చిత్రం డిసెంబర్ 8న ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ లో లాంఛనంగా ప్రారంభం అవుతుంది. ఈ వేడుకలో బాలయ్య తోపాటు ఇతర తారాగణమంతా పాల్గొనే అవకాశం ఉంది. అలాగే సినీ..రాజకీయ ప్రముఖులు కూడా హాజరయ్యే ఛాన్స్ ఉంది. సినిమా ప్రారంభోత్సవానికి బాలయ్య అతని అభిమానులు కొన్ని నెలలుగా వెయిట్ చేస్తున్నారు. తాజాగా ఆ సమయం రానే వచ్చేసింది. దీంతో అభిమానులు రెట్టించిన ఉత్సాహంలో ఉన్నారు. ఓవైపు సంక్రాంతి కానుకగా 'వీరసింహారెడ్డి'గా రచ్చ చేయడానికి రెడీ అవుతోన్న బాలయ్య ఇంతలోనే 108వ సినిమాకి కూడా ముహూర్తం ఫిక్స్ చేయడంతో అభిమానుల్లో రెట్టింపు ఆనందం కనిపిస్తుంది.ఈ కొత్త చిత్రానికి ఎస్. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. బాలయ్య గత సినిమా 'అఖండ'కి సంగీతం అందించింది థమనే. పాటలు సహా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో థియేటర్లని దద్దరిల్లించారు. అందుకే మరోసారి థమన్ ని సీన్ లోకి తెస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ లాంచ్ అయిన నాటి నుంచి జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బాలయ్య అండ్ కో 107వ సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తోన్న ఆ సినిమా తుది మెరుగులు దిద్దుకుంటుంది. టీమ్ నిర్మాణనంతర పనుల్లో బిజీ అయింది. సంక్రాంతి కానుకగా జనవరి 12 సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో బ్యాలెన్స్ పనుల్నింటిని పూర్తి చేసే పనిలో పడ్డారు. పైగా ఈసారి బాలయ్య అన్ స్టాపబుల్ తో తన లో కొత్త యాంగిల్ ని కూడా తట్టిన నేపథ్యంలో రిలీజ్ అవుతోన్న సినిమా కావడం విశేషం. బాలయ్యకి ఆ షో ప్రత్యేక ఇమేజ్ ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ 108వ చిత్రాన్ని షన్ సైన్ స్క్రీన్స్ నిర్మిస్తోంది.





బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న మళయాల నటుడు పృథ్వీరాజ్

మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఇండియాలో ఏ హీరో లేనంత బిజీగా ఉన్నాడు. ఏడాదికి అరడజను సినిమాలు చేస్తూ తీరిక లేకుండా గడుపుతున్నాడు. ప్రస్తుతం సౌత్, నార్త్ అని తేడా లేకుండా ప్రతీ భాషలో మార్కెట్ పెంచుకోవాలని గట్టి ప్రయత్నాలే చేస్తున్నాడు. ఇటీవలే అతను నటించిన 'కడువా' పాన్ ఇండియా సినిమాగా రిలీజై మంచి విజయం సాధించింది. ఇక పృథ్విరాజ్ ఓ వైపు హీరోగా సినిమాలు చేస్తునే పరభాషల్లో ముఖ్య పాత్రలు పోషిస్తున్నాడు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సలార్'లో ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ఇదిలా ఉంటే పృథ్వీరాజ్ తాజాగా బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యాడు. అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'బడే మియాన్ చోటే మియాన్'. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా ఈయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ కబీర్ పాత్రలో కనిపించనున్నాడు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో బ్లూ కలర్ బ్లేజర్ ధరించి స్టైలిష్ విలన్‌లా ఉన్నాడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పూజా ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆజ్ ఫిలింస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని హిందీతో పాటు సౌత్‌లోని అన్ని భాషల్లో వచ్చే ఏడాది రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.





## శివాజీ పాత్రలో అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ్ కుమార్ నటిస్తున్న మరాఠి చిత్రం శివాజీ. పీరియాడిక్ ఫిల్మ్‌గా వస్తున్న ఈ చిత్రానికి మహేశ్ మంజ్రేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. లెజెండరీ మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ పాత్రలో అక్షయ్ నటిస్తున్నాడు. కాగా మేకర్స్ తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. రాజసం ఉట్టిపడేలా శివాజీ మహరాజ్ కాస్ట్యూమ్స్ లో నడుచుకుంటూ వస్తున్న వీడియోను అక్షయ్‌కుమార్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. అయితే, అక్షయ్ తన పాత్రను రివీల్ చేసిన కొద్దిసేపటికే నెటిజన్లు ట్రోల్ చేయడం మొదలు పెట్టారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ పాత్రకు అక్షయ్‌కి బదులు ప్రముఖ టీవీ నటుడు శరద్ కేల్కర్‌ను తీసుకోవాలంటూ కామెంట్లు పెడుతున్నారు. అతనైతే ఈ పాత్రకు కరెక్ట్‌గా సూట్ అవుతాడంటూ కామెంట్ల రూపంలో తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు. నెటిజన్ల విజ్ఞప్తులతో శరద్ కేల్కర్ పేరు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. కాగా, శరద్ కేల్కర్.. 2020లో వచ్చిన హిందీ చిత్రం 'తానాజీ'లో నటించారు. ఆ చిత్రంలో శరద్ ఛత్రపతి శివాజీ పాత్రలో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. టి – సిరీస్ ఫిలిమ్స్, అజయ్ దేవగన్ ఫిలిమ్స్ బ్యానర్‌పై అజయ్ దేవ్‌గణ్, భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్ నిర్మించిన ఈ సినిమాకు ఓం రౌత్ దర్శకత్వం వహించాడు. అజయ్ దేవ్‌గణ్, కాజోల్, జగపతి బాబు , సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా 10 జనవరి 2020న విడుదలైంది. మరికొందరైతే.. 'అక్షయ్.. ఇప్పటికే పృథ్వీ రాజ్ చౌహాన్ పాత్రను చెడగొట్టావు.. ఇప్పుడు మరో చారిత్రక పాత్రను పాడు చేస్తావా ఏంటి..?' అంటూ కామెంట్లు చేస్తున్నారు. అక్షయ్ నటించిన 'సామ్రాట్ పృథ్వీరాజ్' చిత్రం ఈ ఏడాది జూన్ 3న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. చంద్రప్రకాష్ ద్వివేది దర్శకత్వం వహించిన ఈ హిస్టారికల్ మూవీ.. రాజపుత్ర చక్రవర్తి పృథ్వీరాజ్ చౌహాన్ జీవితం, కాలాల ఆధారంగా తెరకెక్కించారు




## దాస్ కా ధమ్కీ నుంచి పాట విడుదల

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తూ డైరెక్ట్ చేస్తున్న ప్యాన్ ఇండియా మూవీ 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. విశ్వక్ తండ్రి కరాటే రాజు నిర్మిస్తున్నారు. ఇటీవల టీజర్‌తో ఇంప్రెస్ చేసిన విశ్వక్, తాజాగా పుట్ ట్యాపింగ్ నంబర్‌తో మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశాడు. 'ఆల్మోస్ట్ పడిపోయిందే పిల్ల' అంటూసాగే పాటను తెలుగు వెర్షన్‌లో సిద్ధు జొన్నలగడ్డ, హిందీ వెర్షన్ సాంగ్‌ను రానా లాంచ్ చేసి విశ్వక్‌కి బెస్ట్ విషెస్ చెప్పారు. లియోన్ జేమ్స్ స్కోర్ చేసిన ట్యూన్ బాగుంది. ఫారిన్ లొకేషన్స్‌లోని విజువల్స్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. విశ్వక్, నివేదా స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్‌తో ఇంప్రెస్ చేస్తున్నారు. లియోన్ జేమ్స్, ఆదిత్య ఆర్కే లైవ్లీగా పాడగా, పూర్ణా చారి లిరిక్స్ ఆకట్టుకుంటున్నాయి. హిందీ వెర్షన్‌కి అమితాబ్ వర్మ లిరిక్స్ అందించగా, లియోన్ జేమ్స్‌తో కలిసి నకాష్ అజీజ్ పాడారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఫిబ్రవరి 17న ఈ చిత్రం విడుదల కానుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in